క్లుప్తంగా

హెచ్ఐవీపై అవగాహన



ప్రచార రథం ద్వారా ఎయిడ్స్ గురించి వివరిస్తున్న దృశ్యం

కర్నూలు(హాస్పిటల్): సమగ్ర ఐఈసీ ప్రచార రథాల ద్వారా హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణ, నియంత్రణ, మత్తు పదార్థాల వినియోగం విరమణ కోసం సొసైటీ ఫర్ రూరల్ అండ్ ఇకో డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం కర్నూలు నగరంలో అవగాహన ప్రచారం నిర్వహించారు. ప్రచార రథం కర్నూలులోని కల్లూరు, మార్కెట్, కొత్త బస్టాండ్, బళ్లారి చౌరస్తా, రాజీవ్ గృహకల్ప, చెన్నమ్మ సర్కిల్‌లో కొనసాగింది. హెచ్ఐవీ/ఎయిడ్స్ ఎలా వస్తాయి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలు, చికిత్సల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ ఎస్.మునీర్ అహ్మద్, పుష్పలత, పద్మ, వీరేష్, చంద్రకళ, సుధాకర్, రవి పాల్గొన్నారు.

నవంబర్ 9న రెడ్ల కార్తీక వనభోజనం



రెడ్ల సంక్షేమ సంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్) : నవంబర్ 9వ తేదీన రెడ్ల కార్తీక వన భోజన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రెడ్ల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు పులకుర్తి నరసింహారెడ్డి తెలిపారు. శనివారం గణేష్ నగర్‌లో ఆ సంఘం కార్యాలయంలో కార్యవర్గ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. జీఆర్‌సీ కన్వెన్సన్‌లో పెద్ద ఎత్తున నిర్వహించే ఈ కార్యక్రమానికి రెడ్ల బంధువర్గమంతా హాజరై కావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ప్రభాకరరెడ్డి, ఉపాధ్యక్షులు దొనపాటి ఎల్లారెడ్డి, దామోదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు విక్రం సింహారెడ్డి, పెరుగు చంద్రమోహన్‌రెడ్డి, ట్రెజరర్ లోకేశ్వరరెడ్డి, జాయింట్ సెక్రటరీ సంపత్తి లక్ష్మీకాంతరెడ్డి, సభ్యులు శ్రీనివాసరెడ్డి, సర్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

కల్లూరు: కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు శనివారం వేడుకగా కలుసుకున్నారు. 20 ఏళ్ల తరువాత కలుసుకున్నావారు ఒకరినొకరు పలకరించుకొని చిన్ననాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులు రత్నం, యేసుప్ప, వాసుదేవయ్య, సాయిలీల, బాబయ్య, పద్మజ తదితరులను ఘనంగా సన్మానించారు. అలనాటి ఉపాధ్యాయులు మాట్లాడుతూ 20 సంవత్సరాల తర్వాత తమ పిల్లలను చూసినట్లుందని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు హుస్సేన్, పూర్వ విద్యార్థులు దామోదర్, మా బాషా, రమేష్, అంజి, నరసన్న, సుధాకర్, పరశురామ్, వాణి, శైలజ, ప్రసన్న, రేవతి తదితరులు పాల్గొన్నారు.

విస్తృత ప్రచారం చేయండి

కర్నూలు (టౌన్): నగరాన్ని క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా మార్చేందుకు ప్రజల్లో చైతన్యం కలిగేలా సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం కల్పించాలని నగరపాలక కమిషనర్ పి. విశ్వనాథ్ కోరారు. శనివారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన చాంబర్‌లో కమిషనర్ సామాజిక మాధ్యమాల ప్రభావితులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, పాల్గొన్నారు.

గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలి



మాట్లాడుతున్న ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప

కర్నూలు (అర్బన్) : రాష్ట్రంలోని మైదాన ప్రాంత గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించి గిరిజన హక్కుల పరిరక్షణకై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప అన్నారు. శనివారం ఆయన నగరంలో విలేకరులతో మాట్లాడుతూ మైదాన ప్రాంత గిరిజనులకు అన్యాయం జరుగుతోందని, వారికి అసెంబ్లీలో ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు కావస్తున్నా నేటికీ రాష్ట్రంలోని లక్షలాది మంది గిరిజనులు కనీసం కూడు, గూడు, నీడ లేక పరితపిస్తున్నారని, ఇప్పటికీ రేషన్ కార్డు, ఆధార్ కార్డు లేక దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారన్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా ఎస్టీ జాబితాలోకి ఇతర కులాలను చేర్చే ప్రతిపాదనను తీసుకురావడం చాలా బాధకరమన్నారు. కార్యక్రమంలో కోడుమూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి అనంతరత్నం, గిరిజన సంఘాల చైర్మన్ రామస్వామి, లంబడా జాతీయ అధ్యక్షులు యోగేష్ నాయక్, ఎస్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుశలన్న పాల్గొన్నారు.

ప్లీజ్.. ఉల్లి కొనండి !

- వ్యాపారులను ప్రాధేయపడిన మార్క్‌ఫెడ్
- క్వింటా ధర రూ.50, రూ.100 మాత్రమే
- ఉల్లి నాణ్యతను పరిశీలించిన కలెక్టర్, జేసీ



మార్కెట్ యార్డులో ఉల్లి నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టర్ సిరి, జేసీ నవ్య

కర్నూలు(అగ్రికల్చర్): మార్క్‌ఫెడ్ రైతుల నుంచి కొన్న ఉల్లిగడ్డలను వదిలించుకునేందుకు నానా తంటాలు పడుతోంది. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ఉల్లి మార్కెట్ యార్డులో, గోదాముల్లో పేరుకుపోయింది. దీనిని ఎలాగైనా విక్రయించాలని శనివారం వేలంపాట నిర్వహించింది. ఈ పాటలో పాల్గొనేందుకు వ్యాపారులు, హోటల్, విద్యాసంస్థల యాజమాన్యాలు ఆసక్తి చూపలేదు. కొది మంది మాత్రమే వేలం పాటలో పాల్గొనగా క్వింటాలు కనిష్ఠంగా రూ.50, గరిష్ఠంగా రూ.440 పలికింది. వారం రోజుల క్రితం కొనుగోలు చేసిన ఉల్లిగడ్డలు కూడా మార్కెట్ యార్డుల్లోని వివిధ షెడ్‌లు, గోదాముల్లో నిల్వ ఉంది. ఒకవైపు వర్షాలు కురుస్తుండటం, మరోవైపు నిల్వ చేసిన ఉల్లికి గాలి కూడా తగలకపోవడంతో కుళ్లి పోతున్నాయి. మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసిన ఉల్లి 3000 టన్నులు ఉండగా... అతి కష్టం మీద బతిమలాడి 1500 టన్నుల వరకు నామమాత్రపు ధరలతో కొనిపించారు. వ్యాపారులు వద్దు వద్దని అంటున్నా బలవంతంగా క్వింటాలు ఉల్లి రూ.50, రూ.100 ప్రకారం అంటగట్టారు. మిగిలిన ఉల్లిని ఆదివారం వేలంపాట ద్వారా విక్రయిస్తారు. ఇది వరకు కొనుగోలు చేసిన ఉల్లిగడ్డలను మార్క్‌ఫెడ్ తాడేపల్లిగూడెం మార్కెట్‌కు, హైదరాబాద్‌లోని మలకపేట మార్కెట్‌కు తరలించేది. అక్కడ నాణ్యత లేదని తిరస్కరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కొనుగోలు చేసిన ఉల్లి గడ్డలను ఏమి చేయాలనే దానిపై ప్లానింగ్ లేకపోవడంతో ఉన్న సరుకు కుళ్లి పోతోంది. కాగా మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసిన ఉల్లి గడ్డల నాణ్యతను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, జాయింట్ కలెక్టర్ నవ్య పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని క్వింటాళ్లు కొన్నారు..ఎన్ని క్వింటాలు బయటికి తరలించారు. మార్కెట్ యార్డులో ఎంత ఉందనే వివరాలను ఆరా తీశారు.

ఘనంగా కోల్స్ దొర జయంతి వేడుకలు



కోల్స్‌దొర విగ్రహానికి పూలమాలలు వేస్తున్న చర్చి కమిటీ సభ్యులు

కర్నూలు (టౌన్) : నగరంలోని స్థానిక పాతబస్టాండ్‌లో కోల్స్ అకరమన్ దొర జయంతి, కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చి వార్షికోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. జీసస్ సోల్జర్స్ అకరమన్ ఇంటర్నేషనల్ సంస్థ, సీసీ సంఘ సభ్యులు కలిసి నిర్వహించిన ఈ వేడుకల్లో ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ మేడికొండ మనోహర్ హాజరై కోల్స్ దొర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మినిస్ట్రీస్ డైరెక్టర్ పాస్టర్ రవికుమార్ మాట్లాడుతూ కోల్స్ దొర కర్నూలు నగరానికి ఎన్నో సేవలు అందించారన్నారు. వార్షికోత్సవ కమిటీ చైర్మన్ రాజరావు, కార్యదర్శి బి. విజయకుమార్, స్టేట్ మైనార్టీ వక్ఫ్‌బోర్డు సభ్యులు మన్సూర్, ఆర్. ప్రసాద్‌రావు, లింకన్, జాన్‌విల్సన్, చర్చి సభ్యులు పాల్గొన్నారు.

నేడు గాడిచర్ల హరిసర్వోత్తమ రావు జయంతి

కర్నూలు కల్చరల్: ఏపీ గ్రంథాలయ సంఘం, గాడిచర్ల ఫౌండేషన్, సాహితీ సదస్సు సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో గాడిచర్ల హరి సర్వోత్తమరావు, మేడూరి దీక్షితుల వెంకట సుబ్బయ్యల జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నారు. మనసు ఫౌండేషన్ డాక్టర్ మన్నం వెంకటరాముడుకు గాడిచర్ల పురస్కారం ప్రదానం చేస్తునట్లు గాడిచర్ల ఫౌండేషన్, సాహితీ సదస్సు అధ్యక్షుడు చంద్రశేఖర కల్కూర తెలిపారు. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ పి. చంద్రశేఖర్, మాజీ రాజ్య సభ సభ్యులు టీజీ వెంకటేష్, డీఈఓ శామ్యూల్ పాల్ అతిథులుగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

జర్నలిస్టులు నిత్య విద్యార్థులుగా ఉండాలి

కర్నూలు(సెంట్రల్): సమాజంలోని మంచి, చెడులపై విశ్లేషణ చేసే జర్నలిస్టులు నిత్య విద్యార్థులుగా వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ అలపాటి సురేష్ కుమార్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని పరిణయ ఫంక్షన్ హాలులో సీఆర్ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో గ్రామీణ విలేకరులకు పునశ్చరణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముందుగా రాష్ట్ర పరిశ్రమల శాఖమంత్రి టీజీ భరత్ హాజరై జర్నలిస్టులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, జాతీయ సభ్యులు వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.



టీటీసీ మొదటి బ్యాచ్ విద్యార్థుల గ్రూప్ ఫొటో

● నాలుగు దశాబ్దాల తర్వాత..

కర్నూలు సిటీ: వారంతా నాలుగు దశాబ్దాల తర్వాత ఒక చోట కలుసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలు, మధుర స్మృతులు, అల్లరి చేష్టలను గుర్తు చేసుకున్నారు. ఆరుపదుల వయస్సును లెక్క చేయకుండా ఎన్నో ఏళ్లకు వచ్చింది వసంతం..విరిసిందీ వసంతం అంటూ ఆడిపాడారు. 1984–85లో ప్రభుత్వ టీచర్ ట్రైనింగ్ చేసిన 60 మంది పూర్వ విద్యార్థులు శనివారం ప్రభుత్వ ఉర్దూ ఉన్నత పాఠశాలలోని పాత టీటీసీ భవనంలో కలుసుకున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు సమ్మేళనంలో సందడి చేశారు. నలభై ఏళ్ల నాటి మైత్రీ బంధం ఎప్పటికి మరిచిపోలేనిదని ప్రముఖ రచయిత, టీటీసీ కాలేజీ మొదటి బ్యాచ్ పూర్వ విద్యార్థి ఇనాయతుల్లా తెలిపారు. తమ ఉపాధ్యాయ శిక్షణ సంస్థ కన్నతల్లిలాంటిదని తాము జీవితంలో ఉపాధ్యాయుడిగా స్థిరపడడానికి రచయితగా, వ్యాఖ్యాతగా రాణించేందుకు ఈ కాలేజీనే పునాదులు వేసిందన్నారు. మొదటి బ్యాచ్‌కి చెందిన టీటీసీ విద్యార్థులందరు ఉత్తమ ఉపాధ్యాయులుగా రాణించారని పూర్వ విద్యార్థి, రిటైర్డ్ డైట్ కాలేజీ లెక్చరర్ అజయ్‌కుమార్ అన్నారు. అనంతరం రిటైర్ అయిన 20 మంది టీచర్లకు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉర్దూ హైస్కూల్ హెచ్ఎం పుష్పరాజ్, సీనియర్ ఉపాధ్యాయులు షుకూర్‌లకు టీటీసీ పూర్వ విద్యార్థులు స్పోర్ట్స్ కిట్‌ను కానుకగా అందజేశారు.

హరిహర క్షేత్రంలో నూతన కలెక్టర్ పూజలు

కర్నూలు కల్చరల్: జిల్లా నూతన కలెక్టర్ డాక్టర్ అట్టాడ సిరి శనివారం సంకల్ బాగ్‌లోని హరిహర క్షేత్రాన్ని సందర్శించారు. వెంకటేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సకల శుభాలు కలగాలని వేద పండితులు ఆశీర్వదించారు. అంతకు ముందు ఆలయ కమిటీ సభ్యులు, అధ్యక్షులు సందేల్ చంద్రశేఖర్, గౌరవాధ్యక్షుడు దుర్గా ప్రసాద్, ప్రధాన కార్యదర్శి నాగరాజ శర్మ, ఉపాధ్యక్షుడు కంచుగంటల శ్యామసుందర్, గౌరవ సలహాదారులు రవిచంద్ర శర్మ, పమితులు మామిళ్లపల్లి రాజేష్, మురళి, ప్రసన్న, భరత్ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

రెడ్‌క్రాస్ చైర్మన్‌గా తిరిగి గోవిందరెడ్డి ఎన్నిక



ఎన్నికైన రెడ్‌క్రాస్ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న డీఆర్‌ఓ వెంకట నారాయణమ్మ

కర్నూలు(హాస్పిటల్): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కర్నూలు జిల్లా చైర్మన్‌గా డాక్టర్ కేజీ గోవిందరెడ్డి తిరిగి ఎన్నికయ్యారు. రెడ్‌క్రాస్ సొసైటీ ప్రస్తుత కార్యనిర్వాహక కమిటీ కాలపరిమితి ఈ నెల 15వ తేదీన ముగియనుండటంతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు శనివారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో డీఆర్‌ఓ వెంకట నారాయణమ్మ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో డాక్టర్ కేజీ గోవిందరెడ్డిని చైర్మన్‌గా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయనతో పాటు వైస్ చైర్మన్‌గా కె.అరుణ, ట్రెజరర్‌గా ఐ. నరసింహ, కమిటీ మెంబర్లుగా జి. శ్రీనివాసులు యాదవ్, బి. ప్రభాకర్‌రెడ్డి, జె.రఘునాథ్ రెడ్డి, వి.భీమశంకర్‌రెడ్డి, ఎస్‌వీ.సుబ్బారెడ్డి, ఎం.జె.బాబురాజు, కేవీ సుబ్బారెడ్డి, మీనాక్షిలను ఎన్నుకున్నారు. ఎన్నికల తనిఖీ అధికారిగా రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ ట్రెజరర్ రామచంద్రరాజు, ఎన్నికల అధికారిగా డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ శాఖ అధికారి వెంకటకృష్ణుడు వ్యవహరించారు.

ఎన్నికల్లో నిబంధనలు పాటించలేదు

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ ఎన్నికల్లో నిబంధనలు, ప్రోటోకాల్ పాటించలేదని మేనేజింగ్ కమిటీ సభ్యులు ఐ.విజయకుమార్‌రెడ్డి విమర్శించారు. కనీసం మేనేజింగ్ కమిటీ తీర్మానం కూడా జరగలేదని, మూడేళ్లుగా వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించలేదని, ఆడిట్ నివేదికల ఆమోదం ప్రస్తావనే లేదన్నారు. మేనేజింగ్ కమిటీ సభ్యులుగా ఉన్న తనతో పాటు ఎల్లారెడ్డి, డాక్టర్ ప్రణీత్‌రెడ్డి, ఇలియాస్‌బాషా, డాక్టర్ మహేంద్రకుమార్, టి.విజయ్‌కుమార్, మధుసూదన్‌కు ఈ సమావేశం గురించి తెలపలేదని తెలిపారు.

రేపు రాక్‌వుడ్ స్కూల్ పూర్వ విద్యార్థుల సమావేశం

కర్నూలు సిటీ: రాక్‌వుడ్ మెమోరియల్ హైస్కూల్‌లో 1986 సంవత్సరంలో పదోతరగతి చదివిన విద్యార్థులు ఈ నెల 15వ తేదీన ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నారు. శనివారం ఆ స్కూల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన టీచర్లను ఘనంగా సన్మానించనున్నామని తెలిపారు. సమావేశంలో పూర్వ విద్యార్థులు టౌన్ మోడల్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ పద్మావతి, సుబ్బరాయుడు, సుధాకర్, లతీఫ్, ప్రకాష్, ఆంజనేయులు, శ్రీనివాసులు, ఏసురత్నం, బసవరాజు, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుకు పోరుబాట



సమావేశంలో మాట్లాడుతున్న రమాదేవి

కర్నూలు(సెంట్రల్) : అంగన్‌వాడీలలకు ఇచ్చిన హామీల అమలు కోసం పోరాటాలకు సిద్ధం కావాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రమాదేవి పిలుపునిచ్చారు. శనివారం కార్మిక, కర్షక భవన్‌లో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ 10వ జిల్లా మహాసభలు రేణుకమ్మ, వరలక్ష్మి, జ్యోతి అధ్యక్షతన జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రమాదేవి, యూనియన్ గౌరవాధ్యక్షురాలు పి.నిర్మల మాట్లాడుతూ..సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో అడగకపోయినా అంగన్‌వాడీలకు యాప్‌ల భారాన్ని తగ్గిస్తామని చెప్పిన చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన తరువాత పట్టించుకోవడంలేదన్నారు. పైగా అప్పటి కంటే ఎక్కువ యాప్‌లను ప్రవేశపెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు చెప్పారు. ఐసీడీఎస్ పరిరక్షణ కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీఎస్ రాధాకృష్ణ, అంజిబాబు పాల్గొన్నారు.

జన విజ్ఞాన వేదిక ఉపన్యాస జాతా ప్రారంభం

కర్నూలు కల్చరల్: రాష్ట్ర స్థాయి జన విజ్ఞాన వేదిక ఉపన్యాస జాతా శనివారం ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని రాష్ట్ర జేవీవీ ప్రధాన కార్యదర్శి బి. విశ్వనాథ్ ప్రారంభించారు. మాట, పాట, ఆట, మ్యాజిక్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు, ఆరోగ్యం, పర్యావరణం, మహిళా సాధికారతపై అవగాహన కలిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు శేషాద్రిరెడ్డి, ఏవీ రమణయ్య, మహమ్మద్ మియ్యా, సురేష్, హరేరాం, ఖాజావలి, మాణిక్యం రీసోర్స్ పర్సన్లుగా వ్యవహరించారు.

మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాటం

- వర్తమాన రాజకీయాలు–సీపీఎం వైఖరి అనే అంశంపై సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఏ గఫూర్

కర్నూలు(సెంట్రల్) : కార్పొరేట్, మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాటం చేయడమే సీతారాం ఏచూరికి సరైన నివాళి అని సీపీఎం కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ అన్నారు. శనివారం ఎస్ఎస్ ఫంక్షన్‌హాలులో సీపీఎం మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి మొదటి వర్ధంతిని పురస్కరించుకొని నగర కమిటీల ఆధ్వర్యంలో వర్తమాన రాజకీయాలు–సీపీఎం వైఖరి అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముందుగా ఏచూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన ఎంఏ గఫూర్ మాట్లాడుతూ..దేశంలోనే రాజకీయ పార్టీలను ఒకేతాటిపైకి తెచ్చిన ఘనత ఏచూరికి దక్కుతుందన్నారు. గతంలో కిషన్ సింగ్ సుజీత్ ఉండేవారని, ఈ కాలానికి ఏచూరి ఆ లోటును తీర్చారన్నారు. రాష్ట్రంలో మతోన్మాద, కార్పొరేట్‌ను బలపరచే పార్టీలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.ప్రభాకరరెడ్డి, జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ ప్రసంగించారు. జిల్లా నాయకులు జి.రామకృష్ణ, అలివేలమ్మ, విజయ్, నరసింహులు, నగేష్ పాల్గొన్నారు.

గురుకులాల్లో పాత టైం టేబుల్‌నే అమలు చేయాలి

కర్నూలు సిటీ: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులాల్లో ఉపాధ్యాయులకు పాత టైం టేబుల్‌నే అమలు చేయాలని ఎస్టీయూ గురుకుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డా.కె. లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. శనివారం సలాంఖాన్ భవనంలో ఎస్టీయూ బీఆర్ అంబేద్కర్ గురుకుల టీచర్స్ జిల్లా విభాగం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గురుకులాల్లో ప్రస్తుతం ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు తరగతుల నిర్వహించేలా టైం టేబుల్ అమలులో ఉందన్నారు. ఇంతకు ముందు ఉదయం 8.45 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉండేదన్నారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు నబీ రసూల్, ఎస్.కిరణ్ రాజు, విజయ భాస్కర్ రెడ్డి, నరసింహస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నర్సుల పదోన్నతులకు కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్.రాధమ్మ

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేసే నర్సులకు పదోన్నతులు కల్పించేందుకు కృషి చేస్తామని ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్.రాధమ్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. కోటమ్మ చెప్పారు. శనివారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఓల్డ్ క్లినికల్ లెక్చరర్ గ్యాలరీలో ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ కర్నూలు జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షురాలు లీలావతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను రెగ్యులరైజ్ చేసేందుకు, వారికి వంద శాతం గ్రాస్ శాలరీ కోసం ఉన్నతాధికారులకు విన్నవించి సాధించేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సమావేశంలో డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్, జోన్–4 పరిధిల్లో ఖాళీగా ఉన్న హెడ్ నర్సు, నర్సింగ్ సూపరింటెండెంట్ పోస్టులను భర్తీ చేయాలని, డీఎంఈ పరిధిలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్, లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని, కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలని, రెగ్యులర్ నర్సింగ్ సిబ్బందికి 8 సంవత్సరాలకు ఒకసారి బదిలీలు జరగాలని, కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులకు కూడా బదిలీలు నిర్వహించాలని, వీటితో పాటు మరో 42 అంశాలను ప్రభుత్వాన్ని కోరేందుకు తీర్మానించారు. సమావేశంలో స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ నర్సింగ్ సూపరింటెండెంట్ అనసూయ, ఏపీ ఎన్‌జీవోస్ నాయకులు కాశన్న, శ్రీనివాస యాదవ్, ప్రభాకర్‌రెడ్డి, నర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి.శాంతిభవాని, జిల్లా ప్రధాన కార్యదర్శి సి.బంగారి, ట్రెజరర్ ఎన్. లక్ష్మీనరసమ్మ, ఈసీ మెంబర్లు యుఎం. శాంతిలత, జె.ఉమారాణి, ఎస్.సోమేశ్వరి, టి. కృష్ణవేణి, ఎ. ఉమాదేవి పాల్గొన్నారు.

'అర్బన్' కాలనీ.. కానరాని అభివృద్ధి



మహాలక్ష్మి నగర్‌లో బురదమయమైన మట్టి రోడ్డు



కల్లూరు: కర్నూలు నగరపాలక సంస్థలో మొత్తం 52 వార్డులు ఉన్నాయి. అందుల్లో 16 వార్డులు కల్లూరు అర్బన్ పరిధిలో ఉన్నాయి. 16 వార్డులలో సుమారుగా 2.5లక్షల మంది జనాభా ఉన్నారు. అర్బన్ ప్రాంతం రోజురోజుకు విస్తరిస్తోంది. మున్సిపాలిటీకి అధిక ఆదాయం 16 వార్డుల నుంచే వస్తుంది. అయితే కల్లూరులోని కాలనీలు అభివృద్ధికి నోచుకోవడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీకర్‌సెక్షన్ కాలనీ, ముజఫర్‌నగర్, పందిపాడు ఇందిరమ్మ కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, మహాలక్ష్మినగర్, నాగేంద్ర నగర్ తదితర కాలనీల్లో రోడ్లు అభివృద్ధికి నోచుకోవడం లేదని ఆయా కాలనీల ప్రజలు వాపోతున్నారు. మట్టి రోడ్లు గుంతలమయంగా ఉండడంతో వర్షపునీరు నిలుస్తోంది. ఈ రోడ్లపై నడవడానికి కూడా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రోడ్లు బురుదమయంగా మారడంతో ద్విచక్రవాహన దారులు అదుపు తప్పి ప్రమాదాలకు గురికావాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. రోడ్లను బాగు చేయాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.

లాభాల బాట పట్టించండి

కర్నూలు(అగ్రికల్చర్): సహకార సంఘాలను లాభాల బాట పట్టించేందుకు సంఘాల అధ్యక్షులు పట్టుదలతో పనిచేయాలని ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం నంద్యాల రోడ్డులోని ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో సహకార సంఘాల అధ్యక్షులతో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి చైర్మన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పలు విధానపర నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. దీర్ఘకాలిక రుణాలపై వడ్డీ రేటును 11.10 శాతం(93 పైసలు) నుంచి 10.35 శాతం(86 పైసలు) తగ్గించినట్లు పేర్కొన్నారు. డీసీసీబీ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా రైతులపై భారాన్ని తగ్గించేందుకు వడ్డీ రేటును తగ్గించామని తెలిపారు. దీర్ఘకాలిక రుణాల పంపిణీకి సంబంధించి బడ్జెట్ అలాట్‌మెంటు ఇప్పటి వరకు 99 సంఘాలకు గాను 46 సంఘాలు మాత్ర మే అర్హత సాధించాయని తెలిపారు. మిగిలిన సంఘాలు కూడా రికవరీ శాతాన్ని పెంచుతామని హా మీ ఇచ్చిన నేపథ్యంలో ఒక్కో సంఘానికి రూ.కోటి ప్రకారం బడ్జెట్ ఇవ్వనున్నామని తెలిపారు. అలాగే పంట రుణాల పంపిణీకి 80 సంఘాలు అర్హత సాధించాయని చెప్పారు. కార్యక్రమంలో టీడీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్, డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, డీసీసీబీ సీఈవో రామాంజనేయులు, డీజీఎంలు ఉమామహేశ్వరరెడ్డి, సునీల్‌కుమార్, నాగిరెడ్డి, ఏజీఎం శ్రీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముజఫర్ నగర్‌లో నిర్బంధ తనిఖీ



యువకులకు సూచనలిస్తున్న పోలీసులు

కర్నూలు : అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట వేసి నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దే లక్ష్యంతో పోలీసులు సమస్యాత్మక కాలనీల్లో నిర్బంధ తనిఖీలు కొనసాగిస్తున్నారు. కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముజఫర్ నగర్‌లో కార్డెన్ సెర్చ్ (నిర్బంధ తనిఖీ) నిర్వహించారు. సీఐ విక్రమ సింహా, ఎస్ఐలు మోహన్ కిషోర్ రెడ్డి, గోపీనాథ్, రామ మునయ్య ఆధ్వర్యంలో సిబ్బంది బృందాలుగా ఏర్పడి ముజఫర్ నగర్‌లో పాత నేరస్తులు, రౌడీ షీటర్లు, అనుమానితులు, ట్రబుల్ మాంగర్స్, సమస్యాత్మక వ్యక్తుల ఇళ్లల్లో తనిఖీలు నిర్వహించారు. వాహన పత్రాలు లేని 4 బైకులను స్వాధీనం చేసుకున్నారు. నేరాలు చేసే వారి గురించి ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని, అల్లర్లు, గొడవల జోలికి పోకుండా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉంటూ గౌరవ ప్రద జీవితం గడపాలని కాలనీ ప్రజలకు సూచించారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ అన్యాయం



గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న ప్రజాపరిరక్షణ సమితి నాయకులు

కర్నూలు(సెంట్రల్) : కూటమి ప్రభుత్వం అత్యంత కీలకమైన మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌కు అప్పగించడం అన్యాయమని ప్రజా పరిరక్షణ సమితి పేర్కొంది. విద్య, వైద్య రంగాలను ప్రైవేట్‌కు అప్పగిస్తే పేదలు, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని ఆవేదన వ్యక్తం చేసింది. శనివారం కలెక్టరేట్ ఎదుట ప్రజా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌కు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆ సంఘం కన్వీనర్ చంద్రశేఖర్, నాయకులు రవికుమార్, శ్రీనివాసులు, రత్నం ఏసేపు, చాంద్‌బాషా మాట్లాడుతూ. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. ఇప్పటికే విద్య పూర్తిగా ప్రైవేట్ పరం కావడంతో ఉచితంగా వచ్చే విద్య కోసం ప్రజలు పొలాలు, ఇళ్లు అమ్మి చదివించుకోవాల్సి వస్తోందన్నారు. వైద్యం కూడా పూర్తిగా ప్రైవేట్‌పరం అయితే వివిధ రకాల పరీక్షలతో ప్రజల ప్రాణాలు తీస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొండిగా ముందుకు వెళ్లితే ప్రజల నుంచి తీవ్ర నిరసన తప్పదన్నారు.

ఉపాధ్యాయులకు బోధనేతర పనులు రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు

కర్నూలు సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు బోధనేతర పనులు రద్దు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకునేందుకుగాను ఈ నెల 15వ తేది నుంచి 19వ వరకు రణభేరి కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. గత విద్యా సంవత్సరానికి ఈ ఏడాదికి ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు లక్షన్నర మందికిపైగా విద్యార్థుల సంఖ్య తగ్గిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటిపోయినా ఇంత వరకు 12వ పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేయలేదని చెప్పారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర సహ ఉపాధ్యక్షుడు సురేష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవి కుమార్, నవీన్‌పాటి, తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల సేవలు చిరస్మరణీయం



సంస్మరణ సభలో నివాళులర్పిస్తున్న కళాకారులు

కర్నూలు కల్చరల్: సుప్రసిద్ధ రంగస్థల నటులు నంది అవార్డు గ్రహీత వన్నెం బలరాం, కళా సేవకులు కామ్రేడ్ జేఎన్ శేషయ్య అందించిన సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. శనివారం కర్నూలు జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో ఆ కళాకారుల సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా వారి చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి బైలుప్పల షఫీయుల్లా, సీనియర్ కళాకారులు వీవీ రమణారెడ్డి, డి.దస్తగిరి, మహమ్మద్ మియ్యా, హనుమంతరావు చౌదరి, సయ్యద్ రోషన్ అలీ, సీబీ అజయ్‌కుమార్, ఎలమర్తి రమణయ్య, రుక్మానంద రెడ్డి, పార్వతయ్య, పల్లయ్య మనోహర్‌బాబు, ముంతాజ్, తదితరులు పాల్గొన్నారు.